## క్లుప్తంగా

### బాలింతలకు వైద్యపరీక్షలు



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ శ్వేత

నిర్మల్‌చైన్‌గేట్: రాంనగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం అమ్మకోసం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా బాలింతలకు వైద్యాధికారి శ్వేత ఆరోగ్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. ప్రసవం తర్వాత ఎదురయ్యే ఆరోగ్య సమస్యలు, పౌష్టికాహారం, పిల్లల సంరక్షణ, తల్లిపాల ప్రాధాన్యత, వ్యాధి నిరోధక టీకాలపై అవగాహన కల్పించారు. రమణ, ఆరోగ్య కార్యకర్త సుజా త, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

### ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కుంటాల: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో గంటల ప్రాతిపాదికన పీజీటీ, టీజీటీ పోస్టుల భర్తీకి అర్హులైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మురళి ఒక ప్రకటనలో తెలిపారు. పీజీటీ తెలుగు-1, మ్యాథమెటిక్స్-2, కామర్స్-1, టీజీటీ సైన్స్-1 పోస్టులకు ఈనెల 23లోగా దరఖాస్తులను ఆదర్శ పాఠశాలలో అందించాలని పేర్కొన్నారు. పీజీటీలకు పీజీ, బీఎడ్‌లో యాభై శాతం మార్కులు, టీజీటీలకు డిగ్రీ, బీఎడ్‌తోపాటు టెట్ అర్హత కల్గి ఉండాలన్నారు. పూర్తి వివరాలకు ఆదర్శ పాఠశాలలో సంప్రదించాలని సూచించారు.

### 27న పీడీఎస్‌యూ సభ

భైంసాటౌన్: జిల్లా కేంద్రంలో ఈనెల 27న నిర్వహించే పీడీఎస్‌యూ సభను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు వి.మహేందర్ పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని గురుకృపా ఒకేషనల్ కళాశాలలో పీడీఎస్‌యూ 50 వసంతాల సభ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సభకు విద్యార్థులు, మేధావులు అధిక సంఖ్యలో రావాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ రాష్ట్ర నాయకుడు రాజన్న, పీఓడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.లక్ష్మి, పీడీఎస్‌యూ జిల్లా సహాయ కార్యదర్శి రాజారాం, సంజన తదితరులు పాల్గొన్నారు.

### డిగ్రీ కళాశాల అభివృద్ధి కమిటీ ఎన్నిక



ఎన్నికైన కళాశాల అభివృద్ధి కమిటీ సభ్యులు

భైంసాటౌన్: పట్టణంలోని జీఆర్‌పీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్లానింగ్, డెవలప్‌మెంట్ కమిటీని గురువారం ఎన్నుకున్నారు. కమిటీ చైర్మన్‌గా కళాశాల ప్రిన్సిపాల్ బుచ్చయ్య, కోఆర్డినేటర్‌గా ఓం ప్రకాశ్, సభ్యులుగా నగేశ్, మనోజ్, బాజీరావు పటేల్, దత్తు, రాహుల్‌రెడ్డి, సంపత్, పాండురంగ్, యోగేశ్ మంధాని ఎన్నికయ్యారు. వైస్ ప్రిన్సిపాల్ రఘునాథ్, సుధాకర్, సంతోష్, సిబ్బంది ఉన్నారు.


### ట్రాన్స్‌ఫార్మర్ కాయిల్స్ చోరీ

భైంసాటౌన్:పట్టణంలోని భోకర్ చౌరస్తా సమీపంలో పంటచేనులోని ట్రాన్స్‌ఫార్మర్ కాయిల్స్‌ను గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. ఈనెల 16న తూమోల్ల రాజుకు చెందిన చేనులో 40 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ కాయిల్స్ చోరీకి గురికాగా, గురువారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నట్లు ఏఎస్సై గణేశ్ తెలిపారు.

### బైక్‌లు ఢీ.. ఇద్దరికి గాయాలు

ముధోల్: మండలంలోని గన్నోరా నుంచి రాజుతండా వెళ్లే మార్గంలో గురువారం ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీకొనడంతో ఇద్దరు గాయపడ్డారు. ఈ ఘటనలో రాజుతండాకు చెందిన సాయినాథ్ తీవ్రంగా గాయపడగా బ్రహ్మణ్‌గావ్‌కు చెందిన మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. వీరిని స్థానికులు భైంసా ప్రభుత్వ ఏరియాసుపత్రికి తరలించారు.

### నేటి నుంచి ప్రారంభం



పోషక పాత్ర-మన వంట అంగన్‌వాడీ ఇంట పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీఆర్డీవో విజయలక్ష్మి

నిర్మల్‌చైన్‌గేట్: పోషకాహార లోపం నివారణకు సామాజిక బాధ్యతగా పోషక పాత్ర -మన వంట అంగన్‌వాడీ ఇంట అనే కార్యక్రమం శుక్రవారం నుంచి ప్రారంభించనున్నట్లు డీఆర్డీవో విజయలక్ష్మి తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను సంబంధిత అధికారులతో కలిసి ఆమె గురువారం కలెక్టరేట్‌లోని డీఆర్డీవో కార్యాలయంలో ఆవిష్కరించారు. డీఆర్డీ శాఖలో పని చేసే డీఆర్డీవో, డీపీఎం, ఏపీఎం, సీసీఎస్, వీవోలు ప్రతి శుక్రవారం తమ ఇంటి వద్ద పోషకాహారం వండి తమ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లలకు అందిస్తారని వారు పేర్కొన్నారు.

# గణనాథుడి నిమజ్జనం



కుంటాలలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్



సోన్ : న్యూవెల్మల్‌లో లడ్డూతో భక్తులు



దిలావర్‌పూర్‌లో నిమజ్జనం చేస్తున్న నాయకులు

కుంటాల: మండలంలోని కల్లూరు, కుంటాల గ్రామాల్లో గురువారం నిమజ్జనోత్సవాలను పురస్కరించుకొని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ పూజలు చేసి శోభాయాత్ర ప్రారంభించారు. ప్రశాంతంగా వేడుకలు జరుపుకోవాలని సూచించారు. కుంటాల యువయూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేశుడి లడ్డూను సబ్బిడి గజేందర్ రూ.18వేలకు దక్కించుకున్నారు. కుంటాల భజరంగ్ యూత్ వద్ద కడార్ల హరిప్రసాద్ భక్తులకు అన్నదానం చేశారు.

నిర్మల్‌టౌన్: పట్టణంలో గణేశుడి నిమజ్జనోత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా సహకరించిన సంబంధిత శాఖల అధికారులు, ప్రజలకు మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ ధన్యవాదాలు తెలిపారు. గురువారం మున్సిపల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకునికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానం ప్రారంభించారు. మున్సిపల్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

దిలావర్‌పూర్: మండలకేంద్రంలో పెద్ద హనుమాన్ ఆలయం నుంచి గణేశుడి శోభాయాత్ర నిర్వహించి కుడిచెరువులో నిమజ్జనం చేశారు. నాయకులు, యువజన సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

**సమష్టి సహకారంతోనే ప్రశాంతం..**

ఖానాపూర్: సమష్టి సహకారంతోనే పట్టణంలో వినాయక నిమజ్జనం ప్రశాంతంగా ముగిసిందని మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం అన్నారు. గురువారం ఆయన పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రజలతోపాటు పోలీస్, మున్సిపల్, విద్యుత్, రెవెన్యూ, ఇతర శాఖల అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.

సోన్: మండలంలోని న్యూవెల్మల్ గ్రామంలో మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి లడ్డూకు గురువారం వేలంపాట నిర్వహించారు. రూ.7200లకు లడ్డూను దీపికవరుణ్ దంపతులు దక్కించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

# అభ్యంతరాలుంటే 21వరకు చెప్పండి

- ముసాయిదా ఓటరు జాబితాపై రాజకీయ నాయకులతో సమావేశం



మామడలో రాజకీయ పార్టీల నాయకులతో మాట్లాడుతున్న ఎంపీడీవో గంగాసాగర్‌రెడ్డి

మామడ: ఓటర్ జాబితాపై అభ్యంతరాలుంటే ఈనెల 21లోగా కార్యాలయంలో లిఖిత పూర్వకంగా తెలియజేయాలని ఎంపీడీవో గంగాసాగర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఓటరు జాబితా ప్రదర్శనపై వివిధ రాజకీయ పార్టీల నాయకులతో ఎంపీడీవో సమావేశం నిర్వహించారు. కుటుంబసభ్యులు ఒకే వార్డులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

నర్సాపూర్(జి): ఓటరు జాబితా రూపకల్పనకు రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని ఇన్‌చార్జి ఎంపీడీవో తిరుపతిరెడ్డి కోరారు. ఎంపీడీవో కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులతో మాట్లాడారు. 13 గ్రామాల్లో 120 వార్డులు, 19,712 మంది ఓటర్లు ఉన్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకులు గడ్డం ఇంద్రకరణ్‌రెడ్డి, బర్కుంట నరేందర్, సుధాన్ పాల్గొన్నారు.

కుంటాల: ముసాయిదా ఓటరు జాబితాపై మండల పరిషత్ కార్యాలయంలో రాజకీయ నాయకులతో ఎంపీడీవో లింబాద్రి సమావేశం నిర్వహించారు. ఎంపీవో రహీం, ప్రవీణ్‌కుమార్, దత్తాద్రి, జక్కుల గజేందర్, జుట్టు నరేందర్, సాయి పాల్గొన్నారు.

ఖానాపూర్: తప్పుల్లేని ఓటరు జాబితాకు రాజకీయ నాయకులు సహకరించాలని మండల ప్రత్యేకాధికారి జీవరత్నం అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో రాజకీయ నాయకులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు దయానంద్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు రాజగంగన్న, బీజేపీ మండలాధ్యక్షుడు టేకు ప్రకాశ్, సీపీఐఎంఎల్ మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి నంది రామయ్య, టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు తిలక్‌రావు, ఎంపీవో రత్నాకర్‌రావు ఉన్నారు.

లోకేశ్వరం: ముసాయిదా ఓటరు జాబితాపై అభ్యంతరాలుంటే ఈనెల 21లోగా తెలియజేయాలని ఎంపీడీవో వెంకటరమేశ్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులకు ముసాయిదా ఓటరు జాబితాపై సమావేశం నిర్వహించారు. ఎంపీఈవో సోలమాన్‌రాజ్, కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ గడ్డం సుదర్శన్‌రెడ్డి, బీజేపీ నాయకుడు నల్ల రమేశ్, రత్నాకర్‌రావు ఉన్నారు.

లక్ష్మణచాంద: ఓటరు జాబితాపై అభ్యంతరాలుంటే చెప్పాలని ఎంపీడీవో రాధ అన్నారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు కృష్ణారెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఒడ్నాల రాజేశ్వర్, బీజేపీ మండలాధ్యక్షుడు గోవర్ధన్ తదితరులు ఉన్నారు.

ముధోల్: ఓటరు జాబితాపై అభ్యంతరాలుంటే చెప్పాలని డీఎల్‌పీవో సుదర్శన్ పాటిల్ అన్నారు. ముధోల్‌లో రాజకీయ పార్టీల నాయకులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఎంపీడీవో గంగాధర్, బీజేపీ నాయకులు పోతన్న, శ్రీనివాస్, సీపీఐ నాయకుడు లింగన్న, బీఎస్పీ నాయకుడు సునీల్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు పరిశుభ్రత పాటించాలి



అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో అబ్దుల్ సమద్

తానూరు: విద్యార్థులు వ్యాధుల బారిన పడకుండా తప్పనిసరిగా పరిశుభ్రత పాటించాలని ఎంపీడీవో అబ్దుల్ సమద్ సూచించారు. గురువారం స్వచ్ఛతహీ సేవా కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు పరిసరాలు, వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కల్పించారు. విద్యార్థులు నిత్యం స్నానం చేసి ఉతికిన దుస్తులు ధరించాలన్నారు. తినే ముందు తప్పనిసరిగా సబ్బుతో శుభ్రంగా చేతులు కడుక్కోవాలన్నారు. ఎంపీడీవో నసీరొద్దీన్, పంచాయతీ కార్యదర్శి జలంసింగ్, తదితరులు పాల్గొన్నారు.

కుంటాల: స్వచ్ఛతపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో లింబాద్రి పేర్కొన్నారు. స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా గురువారం కుంటాల విజయసాయి పాఠశాలలోని విద్యార్థులకు పరిశుభ్రత, ప్లాస్టిక్ వినియోగంతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఎంపీవో ఎంఏ రహీం, పంచాయతీ కార్యదర్శి రాజబాపు, ప్రిన్సిపాల్ పంగెర స్వప్న, మురళి తదితరులు పాల్గొన్నారు.

ఖానాపూర్: తడి, పొడి చెత్తను వేర్వేరుగా పారిశుధ్య సిబ్బందికి అందించాలని ఎంపీవో రత్నాకర్‌రావు అన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని దిలావార్‌పూర్‌లో ప్రజలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం పారిశుధ్య పనులను పరిశీలించారు. పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు ఉన్నారు.

### టీచర్ డుమ్మా..!



తరగతి గదిలో కూర్చున్న విద్యార్థులు

కడెం: మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు రెండు రోజులగా ఉపాధ్యాయురాలు రావడం లేదు. ఉన్న ఒక్క టీచర్ రాకపోవడంతో గురువారం మధ్యాహ్న భోజన సిబ్బంది విద్యార్థులకు భోజనం పెట్టి ఇళ్లకు పంపించారు. ఈ విషయమై పాఠశాల ఉపాధ్యాయురాలు మధురవాణిని సాక్షి వివరణ కోరగా తాను రెండు రోజులు (బుధవారం నుంచి) సెలవులో ఉన్నట్లు సమాధానమిచ్చారు. మరోవైపు ఎంఈవో, కాంప్లెక్స్ హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డిని సంప్రదించగా ఉపాధ్యాయురాలికి లీవ్ మంజూరు చేయలేదని.. విధుల పట్ల నిర్లక్ష్యం వహించినందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

### 'సుప్రీంకోర్టు తీర్పు రద్దు చేయాలి'

నిర్మల్‌టౌన్: ఎస్సీ, ఎస్టీ క్రిమిలేయర్‌పై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వెంటనే రద్దు చేయాలని ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జాతీయ చైర్మన్ వడ్లమూరి కృష్ణస్వరూప్ అన్నారు. గురువారం నిర్మల్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దళిత, గిరిజన, బహుజనులు కలిసి పోరాడకుంటే భావితరాలకు భవిష్యత్తు లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణపై ఏర్పాటు చేసిన కమిటీని రద్దు చేయాలని కోరారు. ఈనెల 30న బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో సమావేశం నిర్వహించి సచివాలయాన్ని ముట్టడిస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు గవ్వల శ్రీకాంత్, పలువురు నాయకులు రత్నం రావు, రాజలింగం, రమేశ్ తదితరులున్నారు.

### రచయితకు సన్మానం

భైంసాటౌన్: మండలంలోని ఇలేగాంకు చెందిన రెడ్ల బాలాజీ గీతాశక్తి పుస్తకాన్ని రచించగా.. ఈ మేరకు ఎమ్మెల్యే రామారావు పటేల్ ఆయన్ను అభినందించారు. ఎమ్మెల్యేను పట్టణంలోని తన నివాసంలో కలిసి పుస్తకం అందజేశారు. ఈ సందర్భంగా బాలాజీని ఎమ్మెల్యే శాలువాతో సన్మానించారు. నేటి తరానికి భగవద్గీత అంశాలను పరిచయం చేయాలనే ఉద్దేశంతో పుస్తక రచన చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అబ్దుల్ రజాక్, నాయకులు నర్సాగౌడ్, భీంరావు, తదితరులు ఉన్నారు.

### భీమ్‌రెడ్డికి నివాళి



మల్లాపూర్‌లో నివాళులర్పిస్తున్న గ్రామస్తులు

లక్ష్మణచాంద: మండలంలోని మునిపెల్లి, మల్లాపూర్ గ్రామాల్లో గురువారం ఉమ్మడి రాష్ట్రంలో డిప్యూటీ స్పీకర్‌గా పని చేసిన భీమ్‌రెడ్డి వర్ధంతి నిర్వహించారు. ఈసందర్భంగా వారి విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పించారు. నియోజకవర్గానికి వారు చేసిన సేవలను గ్రామస్తులు గుర్తుచేసుకున్నారు. భూపాల్‌రెడ్డి, బిట్లింగ్ నారాయణ, సురేశ్, రమేశ్, రవి, శంకర్ తదితరులున్నారు.

### కల్యాణ మండపం ప్రారంభం

నర్సాపూర్ (జి): మండల కేంద్రంలోని రామాలయ ఆవరణలో నర్సాపూర్ (జి)కే చెందిన విశ్రాంత ఉద్యానవన అధికారి గడ్డం గంగారాం రూ.రెండు లక్షలతో నిర్మించిన కల్యాణ మండపాన్ని శ్రీ శ్రీ శివానంద భారతి స్వామి గురువారం ప్రారంభించారు. అనంతరం మండప నిర్మాణ దాతను శాలువా, పూలమాలలతో సన్మానించారు. భక్తులకు అన్నదానం చేశారు. ఈనెల 25 వరకు రామకోటి పారాయణం కొనసాగుతుందని ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.


# సమస్యల పరిష్కారానికి కృషి



ఎన్నికైన మండల కార్యవర్గం

లోకేశ్వరం: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు నరేంద్రబాబు అన్నారు. గురువారం మండలంలోని మన్మద్ గ్రామ ఉన్నత పాఠశాల ఆవరణలో పీఆర్టీయూ లోకేశ్వరం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అనంతరం లోకేశ్వరం మండల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా నాలం రాజేందర్, ప్రధాన కార్యదర్శిగా జెడ్ల రాజారాం, అసోసియేట్ అధ్యక్షుడిగా మురళీధర్, కార్యదర్శిగా ప్రభాకర్, మహిళ ఉపాధ్యక్షురాలిగా కృష్ణవేణి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రమణారావు, రాష్ట్ర నాయకులు మాల్యాగౌడ్, సుభాశ్, అశోక్‌రెడ్డి, కోటేశ్వర్‌రావు, సదానందం, నవీన్, బర్ల చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

### పీసీసీ అధ్యక్షుడిని కలిసిన మాజీ ఎమ్మెల్యేలు



మహేశ్‌కుమార్‌గౌడ్‌తో మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు

నిర్మల్‌టౌన్: హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు, నాయకులు గురువారం పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్ కుమార్‌గౌడ్‌ను మర్యాదపూర్వంగా కలిశారు. ఈసందర్భంగా వారిని గజ మాలతో సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు విఠల్ రెడ్డి, రేఖా శ్యామ్‌నాయక్, రాథోడ్ బాపురావు, లోకా భూమారెడ్డి, అల్లోల మురళీధర్ రెడ్డి, పాకాల రాంచందర్, భూమన్న యాదవ్, తదితరులున్నారు.

# సాయం అందించరూ..



నిమ్స్‌లో చికిత్స పొందుతున్న చిన్నారి రక్షిత వద్ద తల్లిదండ్రులు

- అనారోగ్యంతో నిమ్స్‌లో చికిత్స పొందుతున్న రక్షిత
- గుండెకు ఆపరేషన్ చేయాలంటున్న వైద్యులు
- దాతలు ఆర్థికసాయం అందించాలని వేడుకుంటున్న బాధిత కుటుంబం

ఫోన్‌పే, గూగుల్‌పే నం: 8106719646
ఎలిగేటి ప్రవీణ్ (చిన్నారి బాబాయ్)
ఎలిగేటి లావణ్య, బ్యాంకు ఖాతా నంబరు :
22821010003709 2
యూబీఐ, బొప్పారంశాఖ
ఐఎఫ్ఎస్‌సీ కోడ్ :
UBIN0822825

సోన్: అనారోగ్యంతో బాధపడుతున్న తమ కూతురును కాపాడుకునేందుకు ఓ పేదకుటుంబానికి చెందిన తల్లిదండ్రులు ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. నిర్మల్ జిల్లా సోన్ మండలం కూచన్‌పెల్లి గ్రామానికి చెందిన ఎలిగేటి లావణ్య-ప్రణయ్‌కుమార్ దంపతుల కూతురు రక్షిత (9) అనారోగ్యంతో బాధపడుతోంది. గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్న ఈ చిన్నారి ఎడమ కాలికి రక్తప్రసరణ జరగకపోవడంతో రక్తం గడ్డకట్టింది. స్థానిక ఆసుపత్రుల్లో చూపించినా నయం కాకపోవడంతో హైదరాబాద్ నిమ్స్‌లో చేర్పించారు. పాప కాలికి ఆపరేషన్ జరగడంతో ప్రస్తుతం కోలుకుంటుంది.

**ఆపరేషన్‌కు రూ.రెండున్నర లక్షలు..**

మరోవైపు రక్షిత గుండె సంబంధిత వ్యాధితోనూ బాధపడుతుండగా ఆపరేషన్ చేయాలని.. ఇందుకు రూ.రెండున్నర లక్షలు అవుతుందని వైద్యులు చెబుతున్నారు. రెక్కాడితే కాని డొక్కాడని పేద కుటుంబం వీరిది. చిన్నారి తల్లి బీడీ కార్మికురాలు కాగా తండ్రి కూలీ. కాలి ఆపరేషన్‌కే అప్పులు చేసి రూ.మూడు లక్షల వరకు ఖర్చు చేశామని.. ఇప్పుడు మళ్లీ గుండెకు ఆపరేషన్‌కు డబ్బు ఎక్కడి నుంచి తెస్తామని రక్షిత తల్లిదండ్రులు వాపోతున్నారు. ఆపరేషన్‌కు దాతలు ముందుకొచ్చి ఆర్థిక సాయం అందించాలని వేడుకుంటున్నారు.

# విధులకు ఆటంకం కలిగించిన ముగ్గురిపై కేసు

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలో గణేశుడి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఈనెల 16న బంగల్‌పేట్ ఏరియాలో పట్టణ పోలీసులు బైక్ పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా.. రోడ్డుపై శివశక్తి యువసేన సభ్యులు గణేశుడి వాహనం నిలిపి ఉంచారు. వాహనాన్ని ముందుకు తీసుకెళ్లాలని సూచించినా వినకుండా పోలీసులను అసభ్య పదజాలంతో దూషిస్తూ చేతులతో నెట్టేసిన వినయ్, రాకేశ్, కపిల్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

**రెచ్చగొట్టేలా పోస్ట్ చేసిన వ్యక్తిపై కేసు**

నిర్మల్‌టౌన్: సోషల్ మీడియాలో విద్వేషాలు రెచ్చగొట్టేలా పోస్ట్ చేసిన పట్టణానికి చెందిన ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. సదరు వ్యక్తి ఓ వర్గం మనోభావాలు దెబ్బతినేలా సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. ఈవిషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే అతడిని స్టేషన్‌కు పిలిపించారు. పోస్టు డిలీట్ చేయించి.. కేసు నమోదు చేశారు.

## సంక్షిప్త వార్తలు

**పీఆర్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడికి సన్మానం**

కుభీర్: మండలంలోని పల్సి ప్రధానోపాధ్యాయుడు దొంతుల సురేశ్ పీఆర్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. వారిని గురువారం రాష్ట్ర అసోషియేట్ సభ్యుడు ఎస్.శంకర్ వారిని శాలువా, పూలమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు సాయన్న, ఉపాధ్యాయ సంఘం నాయకులు భాస్కర్‌రెడ్డి, రాజశేఖర్, ఎర్రన్న, మధుసూదన్, సంజీవ్ తదితరులు ఉన్నారు.

**ఆలయంలో హుండీ చోరీ**

భైంసాటౌన్: పట్టణంలోని నర్సింహానగర్‌లో ఉన్న ఐదుచేతుల పోచమ్మ ఆలయంలో హుండీ చోరీకి గురైనట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. గురువారం మధ్యాహ్నం ఆలయానికి వెళ్లి చూడగా హుండీ కనిపించ లేదన్నారు. ఈ మేరకు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు వెల్లడించారు.

**హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన**

నిర్మల్‌రూరల్: మండలంలోని ముజిగి ఉన్నత పాఠశాలలో గురువారం జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సీటీసీ, డీఎస్‌ఆర్‌సీ కౌన్సిలర్లు సుదర్శన్, శ్రీనివాస్, ఉపాధ్యాయులు నర్సారెడ్డి, నరేందర్‌రెడ్డి, రవిగౌడ్, దేవదాస్, ముత్యం, మంజుల, గులాబ్ సింగ్, సంగీత విద్యార్థులు పాల్గొన్నారు.

**బియ్యం, సరుకులు అందజేత**

ఖానాపూర్: మండలంలోని రంగపేట గ్రామానికి చెందిన ఎం.లింగన్న ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. గురువారం బాధిత కుటుంబాన్ని బీజేపీ మండల ఉపాధ్యక్షుడు ఎనగందుల రవి పరామర్శించి 25 కిలోల బియ్యం, నిత్యావసర వస్తువులను అందజేశారు. గ్రామస్తులు ఉన్నారు.

**గుంతలు పూడ్చివేత**

ముధోల్: మండలంలోనిలో బోరిగాం నుంచి కారేగాం రోడ్డు మధ్యలో ఉన్న లోలెవెల్ వంతెనపై ఇటీవలి వర్షాలకు గుంతలు ఏర్పడ్డాయి. దీంతో వాహనదారుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బోరిగాం గ్రామానికి చెందిన రామ్‌సేనా యూత్ సభ్యులు గురువారం సిమెంట్, కాంక్రీట్‌తో గుంతలు పూడ్చివేశారు.

**గ్యాస్ సబ్సిడీ పత్రాలు అందజేత**

కడెం: కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు అండగా నిలుస్తుందని యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పి.సతీశ్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని కొండుకూర్‌లో పలువురు లబ్ధిదారులకు గ్యాస్ సబ్సిడీ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ సంతోశ్‌రెడ్డి, శ్రీనివాస్, గంగన్న, రాజమౌళి, రేషన్ డీలర్ షర్ఫొద్దీన్, కార్యదర్శి అరుణ, అంగన్‌వాడీ టీచర్ గంగామణి తదితరులున్నారు.

**'చర్చి నిర్మాణం నిలిపివేయాలి'**

పెంబి: మండల కేంద్రంలో అనుమతుల్లేకుండా చేపట్టిన చర్చి నిర్మాణం నిలిపివేయాలని హిందూవాహిని, హిందూ సంఘాల నాయకులు గురువారం తహసీల్దార్ లక్ష్మణ్, ఎంపీడీవో రమాకాంత్‌కు వేర్వేరుగా వినతిపత్రం అందజేశారు. దీనిపై ఎంపీవో అనిల్‌కుమార్ ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శి నరేశ్‌చారి చర్చి పాస్టర్ యేసుదాసుకు నోటీసు అందజేశారు. విచారణ పూర్తయ్యే వరకు పనులు చేపట్టొద్దని సూచించారు.

**పొలాలు పరిశీలన**

ముధోల్: మండల కేంద్రంలోని వరి పొలాలను ముధోల్ ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త నర్సయ్య ఆధ్వర్యంలో బుధవారం శాస్త్రవేత్తలు పరిశీలించారు. ఈసందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు విజయ్‌కుమార్ కార్తీక్ ఉన్నారు.

**పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి**

లోకేశ్వరం: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఎంపీడీవో వెంకటరమేశ్ అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందికి నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రోజు తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి సెగ్రిగేషన్ షెడ్డుకు తరలించాలని పేర్కొన్నారు. ఎంపీఈవో సోలమాన్‌రాజ్, ఏపీవో జగన్నాథ్, ఈసీ అనిల్ ఉన్నారు.

**పాఠశాలలు సందర్శన**

లక్ష్మణచాంద: విద్యార్థుల కనీస సామర్థ్యాలను గుర్తించేందుకు బేస్ లైన్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు మండల నోడల్ అధికారి అశోక్ వర్మ పేర్కొన్నారు. గురువారం ఎఫ్‌ఎల్‌ఎన్(ఫౌండేషన్ లిటరసీ న్యూమరసీ) కార్యక్రమంలో భాగంగా మండలంలోని తిర్పెల్లి, పొట్టపెల్లి(కే) ప్రాథమిక పాఠశాలలు, మండల కేంద్రంలోని కేజీబీవీని సందర్శించారు. రిజిస్టర్లు, రికార్డులు పరిశీలించారు. రూమ్ టు రీడ్ మండల కోఆర్డినేటర్ గోవర్ధన్ నాయుడు, సీఆర్పీలు మహేందర్, సుధాకర్ పాల్గొన్నారు.

**వినతిపత్రం అందజేత**

కుభీర్: తమ గ్రామాన్ని కుప్టి నుంచి విడగొట్టి.. ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయాలని వర్ని గ్రామస్తులు గురువారం పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందించారు. శుక్రవారం తహసీల్దార్, ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తామని పేర్కొన్నారు. మాజీ సర్పంచ్ గంగాధర్, నాయకులు దశరథ్, హన్మండ్లు, ఆశన్న తదితరులు ఉన్నారు.